నాసా ప్రాంతీయ కన్వెన్షన్‌లో గీతం విద్యార్థిని ప్రతిభ

● 'రైటింగ్ ఆర్కిటెక్చర్' పోటీలో ప్రత్యేక అవార్డు

7

తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎవరూ కూడా సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. నర్సాపూర్ స్టేషన్ పరిధిలో చనిపోయిన వ్యక్తి పేరు ఎఫ్ఐఆర్‌లో నమోదైనట్లు వస్తున్న ప్రచారంపై గురువారం జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో ఆయన వివరాలను వెల్లడించారు. భూ వివాదం విషయంలో ఇమ్మడి శ్రీనివాస్ సెప్టెంబరు 23న ఫిర్యాదు ఇవ్వగా నలుగురిపై కేసు నమోదైందన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు తర్వాత కేసు పూర్తి విచారణ చేపడుతామన్నారు. విచారణతో సంబంధం లేని వారిని కేసు నుంచి తొలగిస్తామన్నారు. ఫిర్యాదులో ఉన్న విఠల్ కేసు నమోదు కాక ముందు మరణించాడని, తమ విచారణలో తేలగానే ఈ కేసు నుంచి ఆయన పేరును తొలగించామన్నారు. ఈనెల 8న భూ వివాదం జరుగగా.. మళ్లీ కేసును నమోదు చేశామన్నారు. ఒక వర్గం వారు పోలీసులను అభాసుపాలు చేసేలా చనిపోయిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ విషయంలో పోలీసుల తప్పులేదన్నారు. ఈ కేసుకు సంబంధించి ఎవరైనా అబద్ధపు ప్రచారాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కుటుంబీకులు తప్పుడు సమాచారమివ్వడంతోనే..

నర్సాపూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం నారాయణపూర్ పంచాయతీ పరిధిలో భూ వివాదానికి సంబంధించి, ఆ కుటుంబీకులు ఇచ్చిన తప్పుడు సమాచారం మేరకే ఎఫ్ఐఆర్‌లో చనిపోయిన వ్యక్తి పేరు వచ్చింది తప్పా ఎలాంటి నిర్లక్ష్యం చేయలేదని సీఐ జాన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్ సీఐ కార్యాలయంలో ఎస్ఐ లింగంతో కలిసి సీఐ వివరాలను వెల్లడించారు. పోలీసులను తప్పుదోవ పట్టించారని, గ్రామంలో విచారణ చేపట్టగా చనిపోయినట్లు తేలిందని, దీంతో ఎఫ్ఐఆర్ నుంచి చనిపోయిన వ్యక్తి పేరు తొలగించి చార్జిషీట్ వేయనున్నామన్నారు. అంతలోనే కావాలని పోలీసులను బద్నాం చేయాలనే సోషల్‌మీడియాలో ప్రచారం చేశారన్నారు. పోలీసులను తప్పుదోవ పట్టించిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.



కోహీర్‌లో చలిమంట కాచుకుంటున్న వృద్ధులు

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు

సంగారెడ్డి జిల్లాలో.. కోహీర్ 9.0 డిగ్రీలు, న్యాల్‌కల్ మండలంలో 9.9, జహీరాబాద్‌లో 10.6 కంగ్టిలో 10.7, సత్వార్‌లో 10.7, అందోల్‌లో 11.1, గుమ్మడిదలలో 11.2, మునిపల్లిలో 11.4, మొగుడంపల్లిలో 12.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలో.. శివ్వంపేటలో 11.6 డిగ్రీలు, కౌడిపల్లిలో 11.6, టేక్మాల్‌లో 12.3, హవేళీఘనపూర్‌లో 12.3, చిలప్‌చెడ్‌లో 12.3, నార్సింగ్‌లో 12.4 డిగ్రీలు

సిద్దిపేట జిల్లాలో.. మర్కుక్‌లో 11.1 డిగ్రీలు, కొండపాకలో 11.5, పోతిరెడ్డిపేట 11.6, నంగనూరులో 12.1, జగదేవ్‌పూర్‌లో 12.1 డిగ్రీలు

ఇగమొస్తున్నది

ఉమ్మడి జిల్లా గజగజ

మరింత పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రత
కోహీర్ మండలంలో 9 డిగ్రీలు
ఐదేళ్లుగా అత్యల్ప ఉష్ణోగ్రతలు
న్యాల్‌కల్ మండలంలోనూ కనిష్ఠం

కోహీర్/మెదక్ అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా గజగజ వణికిపోతున్నది. జిల్లా అంతటా రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో శీతల గాలులతో పాటు చలి తీవ్రత పెరిగింది. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలంతో పాటు న్యాల్‌కల్ మండలంపై అత్యధికంగా ప్రభావం కనపడుతున్నది. కోహీర్, జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల్లో ప్రతి సంవత్సరం రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఐదేళ్లుగా కోహీర్ మండలంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డుస్థాయికి పడిపోతున్నాయి. ఇక్కడ మూడు రోజులుగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు కాగా సోమవారం రాత్రి వరకు సింగిల్ డిజిట్‌కు పడిపోయింది. మొన్న 9.5 డిగ్రీలు నమోదవగా, మంగళవారం రాత్రి 9.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో నమోదైన ఉష్ణోగ్రతలలో ఇదే తక్కువ.

కోహీర్‌లో నాలుగు రోజుల నుంచి రాత్రి ఉష్ణోగ్రతలు

శనివారం	14.5
ఆదివారం	12.7
సోమవారం	9.5
మంగళవారం	9.0 డిగ్రీలు

చలి తీవ్రతకు కారణాలు

జహీరాబాద్ ప్రాంతానికి సరిహద్దు ప్రాంతమైన కర్ణాటక, మహారాష్ట్రల పరిధిలో అటవీ భూములు అత్యధికంగా ఉండడంతోనే యేటా చలికాలంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ జహీరాబాద్, మొగుడంపల్లి, నాల్కల్ మండలాలకు సరిహద్దుల్లో కర్ణాటక రాష్ట్రం ఉన్నది. ఈ ప్రాంతంలో పడమర వైపున అత్యధికంగా అడవులు ఉండడం, తక్కువ ఎత్తు నుంచి ఈదురుగాలులు వీచే క్రమంలో చలిగాలులు మరింత పెరిగి అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు అవుతున్నాయని నిపుణులు పేర్కొన్నారు. అంతేకాకుండా నల్లరేగడి భూములు ఉండడం కూడా ఇందుకు కారణమని చెబుతున్నారు. ఈ భూముల్లో అత్యధికంగా తేమ శాతం ఉండడం వల్ల ఈదురుగాలులు వచ్చే క్రమంలో భూమిలోని తేమశాతం అధికమై చల్లని గాలులకు కారణమవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. మరో రెండు రోజులు సంగారెడ్డి జిల్లాలో మరింత అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో పెరిగిన చలి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడంతో చలి తీవ్రత పెరిగింది. మొన్నటి వరకు చలి తక్కువగా ఉన్నది. వారం రోజుల క్రితం వరకు 17 డిగ్రీలున్న ఉష్ణోగ్రతలు కార్తీక పౌర్ణమి నుంచి క్రమంగా పడిపోయాయి. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలంతో పాటు న్యాల్‌కల్ మండలంలోనూ రాత్రి ఉష్ణోగ్రత

మిగతా 8వ పేజీలో

బాల వైజ్ఞానిక ప్రదర్శనకు సర్వం సిద్ధం

● విద్యాశాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి నిర్వహణ

● సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు




బాల వైజ్ఞానిక ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీలో డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : బాల వైజ్ఞానిక ప్రదర్శనం సర్వం సిద్ధం చేశామని, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి వారిని భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డి శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో బుధవారం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంచి, వారి సృజనాత్మకతకు సానపెట్టేందుకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి మూడు రోజుల పాటు జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశామని పేర్కొన్నారు. సుస్థిర భవిష్యత్తు కోసం శాస్త్ర సాంకేతిక(సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టేనబుల్ ఫ్యూచర్) ప్రధాన అంశంపై బాల వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏడు ఉప అంశాలపై ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. ఆహారం, ఆరోగ్యం-పరిశుభ్రత, రవాణా కమ్యూనికేషన్, సహజ వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, గణిత నమూనాలు గణన ఆలోచన, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ అంశాలపై నూతన ఆవిష్కరణలు ప్రదర్శిస్తారన్నారు. ఇవే కాకుండా టీచర్ ఎగ్జిబిట్‌లు, బీఈడీ-డీఈడీ ట్రైయినీ విద్యార్థులు కూడా బోధనా అభ్యసనా సామగ్రిని ప్రదర్శించే అవకాశం కల్పించినట్లు తెలిపారు. జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కోసం 11 కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రదర్శనలో 923 విద్యార్థుల ఎగ్జిబిట్లను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, 12 మంది టీచర్ ఎగ్జిబిట్ల ప్రదర్శనకు నమోదుకు చేసుకున్నారని తెలిపారు. ఇవే కాకుండా జిల్లా స్థాయిలో 95 ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శనకు ఎంపికయ్యాయని తెలిపారు. ఆయన వెంట జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, మాజీ సైన్స్ అధికారి విజయ్‌కుమార్, నోడల్ అధికారి లింబాజీ, సంగారెడ్డి ఎంఈవో విద్యాసాగర్, కోహీర్ ఎంఈవో, మీడియా కన్వీనర్ జాకీర్ హుస్సేన్, కోకన్వీనర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి రానున్న ఆర్‌వోబీ

● బిల్లుల రావడంతో పనుల్లో వేగం
● ఇప్పటికే 70 శాతం పనులు పూర్తి
● మరో నెలరోజుల్లో అందుబాటులోకి వచ్చేలా చర్యలు
● రేపటి నుంచి పనులు పూర్తయ్యే వరకు బ్రిడ్జికి ఇరువైపులా రాకపోకలు బంద్

8



ఎవరికోసం కట్టారో..!

● రూ. లక్షల ఖర్చు వృథా
● వినియోగంలోకి రాని భవనాలు
● హత్నూరలో అలంకరప్రాయంగా ఐబీ అతిథిగృహం
● నర్సాపూర్‌లో మూడేళ్లుగా నిరుపయోగంగా మరుగుదొడ్లు
● వెల్దుర్తిలో బస్టాండ్ కట్టి 17 ఏళ్లు

7

నల్లవాగుపైనే ఆశలు

● యాసంగిలో 4 వేల ఎకరాలకు నీరందించడమే లక్ష్యం
● ప్రాజెక్టులో నీరు పుష్కలం.. త్వరలో ఆయకట్టు నిర్ధారణ
● ప్రాజెక్టుకు కుడి, ఎడమ కాల్వలతో రెండు మండలాలకు ప్రయోజనం

7





సంగారెడ్డిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన మార్కెట్ నిర్మాణ పనులు

పూర్తయ్యేనా?

అటకెక్కిన సంగారెడ్డి వెజ్, నాన్‌వెజ్ దుకాణ సముదాయం

● రూ.6.70 కోట్ల పనులకు గ్రహణం

● బిల్లులు చెల్లించకపోవడంతో చేతులెత్తేసిన కాంట్రాక్టర్

సంగారెడ్డి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్మిస్తున్న వెజ్ - నాన్‌వెజ్ దుకాణ సముదాయం పనులు నిలిచిపోయాయి. సంగారెడ్డి బైపాస్‌లోని జిల్లా జడ్జి నివాసం సమీపంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో కూరగాయలు, మాంసాహార మార్కెట్ దుకాణ సముదాయాన్ని అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.6.70 కోట్లతో 120 దుకాణాల నిర్మాణాన్ని తలపెట్టింది. నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పనులకు శంకుస్థాపన చేశారు. పనులను ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదుర్చుకుని ప్రారంభించారు. దాదాపు 40 శాతం పనులు పూర్తయినా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో వెజ్ - నాన్ వెజ్ దుకాణ సముదాయం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

రోడ్లపైనే మార్కెట్లు

పట్టణంలో చేపట్టిన దుకాణ సముదాయాల పనులు నిలిచిపోవడంతో రోడ్లపైనే మార్కెట్లు కొనసాగుతున్నాయి. ప్రధాన రహదారి పక్కన ఎక్కడ పడితే అక్కడ మాంసం, కూరగాయల దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. పాతబస్టాండ్, కొత్తబస్టాండ్ వద్ద, కల్వకుంట్ల రోడ్డు, బైపాస్, కలెక్టరేట్, సాయిబాబా ఆలయం కమాన్ వద్ద రోడ్డుపై చిన్న చిన్న డబ్బాలను ఏర్పాటు చేసుకుని విక్రయిస్తున్నారు. రోడ్ల పక్కన చిరువ్యాపారులకు ఇబ్బందులు తిప్పలు తప్పడం లేదు. దుకాణ సముదాయం నిర్మాణం పూర్తయితే వీటికి చెక్‌పడే అవకాశం ఉంది.



నిలిచిన మార్కెట్ నిర్మాణ పనులు

సంగారెడ్డి జిల్లాలో 75 శాతం సర్వే

● ఎన్యూమరేటర్లు నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలి

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ఇప్పటివరకు 75 శాతం పూర్తయిందని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని 32వ వార్డులో సమగ్ర కుటుంబ సర్వే తీరును బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, బలహీన వర్గాల అభ్యున్నతికి అవసరమైన సామాజిక ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపరిచేందుకు సరైన ప్రణాళికలు రూపొందించడానికి వివరాలను సేకరిస్తున్నామన్నారు. ప్రజల సహకారంతో సర్వే విజయవంతంగా కొనసాగుతోందని, సర్వేకు సానుకూలంగా స్పందిస్తున్నారన్నారు. నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లకు కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో పరిశుభ్రత లోపిస్తే సంబంధిత శాఖల అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ క్రాంతి హెచ్చరించారు. అన్ని శాఖల కార్యాలయాల వద్ద పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, వాహనాలు క్రమపద్ధతిలో పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏవో పరమేశంను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. ప్రతీ రోజు సాయంత్రం 6 గంటల అనంతరం కలెక్టరేట్‌లో ప్రవేశించే వాహనాలకు స్టిక్కర్లు, సిబ్బందికి ఐడీ కార్డు ఉంటేనే అనుమతించాలని ఆదేశించారు.ఆమె వెంట అదనపు కలెక్టర్ మాధురి, డీఎస్పీ సత్తయ్యగౌడ్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, తహసీల్దార్ దేవదాస్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

మెదక్‌లో 95 శాతం పూర్తి

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మెదక్ మున్సిపల్ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 95 శాతం పూర్తయిందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. పట్టణంలో 32 వార్డులుండగా మొత్తం 12168 నివాస కుటుంబాలున్నట్లు, మంగళవారం వరకు 11,547 ఇళ్లల్లో వివరాలను నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మరో రెండు రోజులు గడువు పెంచినట్లు, ఈనెల 22 వరకు వివరాలు నమోదు చేసుకుంటామని ఆయన తెలిపారు.



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సర్వేను బహిష్కరించిన అంబోజిబొగుడ తండావాసులు

వట్‌పల్లిలో విలీనం చేస్తేనే సహకరిస్తాం

వట్‌పల్లి, నవంబరు 20.(ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను బహిష్కరించారు వట్‌పల్లి మండలంలోని అంబోజిబొగుడ గిరిజన తండావాసులు బహిష్కరించారు. తమ తండాను వట్‌పల్లి గ్రామపంచాయతీలో విలీనం చేస్తేనే సహకరిస్తామని తేల్చి చెప్పారు. బుధవారం సమగ్ర కుటుంబ సర్వేకు తండాకు వచ్చిన ఎన్యూమరేటర్‌కు వివరాలను అందించకుండా తిప్పి పంపించారు. అంబోజిగొగుడ గిరిజన తండాను 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంచిర్యాల గ్రామపంచాయతీలో కొనసాగుతుండడంతో అభివృద్ధి కుంటుపడుతుందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తండాలో నెలకొన్న పలు సమస్యలను విన్నవించాలంటే అంత దూరంలోని మంచిర్యాల తండాకు వెళ్లవలసి వస్తుందని వాపోయారు. రెండు కిలోమీటర్ల దూరంలోని వట్‌పల్లి గ్రామపంచాయతీలో విలీనం చేయాలని కోరుతూ పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎలాంటి చలనం లేదంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన తండా అంటే చిన్నచూపు చూసే అధికారులకు తమ వివరాలతో ఏంపనంటూ మండిపడ్డారు. జిల్లా అధికారులు తమ గోడును అర్థం చేసుకొని వట్‌పల్లి గ్రామ పంచాయతీలో అంబోజిబొగుడ గిరిజన తండాను విలీనం చేస్తేనే సర్వేకు సహకరిస్తామని లేకుంటే దూరంగా ఉంటామని తండావాసులు భీష్మించుకు కూర్చున్నారు. దీంతో ఎన్యూమరేటర్ చేసేదేమీలేక వెనుదిరిగిపోయారు.



సర్వే చేయొద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న అంబోజిబొగుడ వాసులు

వైద్య విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

● ఓసీడీ వ్యాధి తట్టుకోలేకనే అంటూ సూసైడ్ నోట్

సిద్దిపేట అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని మెడికల్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న ఏసీపీ మధు, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ బుధవారం కళాశాలను సందర్శించారు. వారి కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని ఏడేళ్లుగా ఓసీడీ వ్యాధితో బాధపడుతూ మందులు వాడుతోంది. ఆమెకు మెడికల్ సీటు రావడంతో సిద్దిపేట సురభి మెడికల్ కళాశాలలో ఐదు రోజుల క్రితమే చేరింది. ఆమెకు ఇక్కడ చదవడం ఇష్టం లేదని.. తల్లిదండ్రుల వద్దకు ఎలాగైనా వెళ్లాలనే ఆలోచనతో శనివారం సూసైడ్ నోట్ రాసి, ఆదివారం కళాశాల భవనంపై నుంచి దూకింది. ప్రస్తుతం విద్యార్థిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది. విద్యార్థిని గదిలో దొరికిన సూసైడ్ నోట్‌లో కొంతకాలంగా ఓసీడీ వ్యాధితో బాధపడుతున్నానని, తగ్గకపోవడంతో జీవితంపై విరక్తితో ఆత్మహత్యాయత్నం చేసుకుటున్నానని రాసి ఉన్నట్లు పోలీసులు చెప్పారు. ఈ విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

అనంత పద్మనాభ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటు

● ఉత్తర్వులు జారీ చేసిన దేవాదాయ శాఖ

పుల్‌కల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం చక్రియాల గ్రామంలోని అత్యంత పురాతనమైన శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటైంది. ఈ మేరకు దేవాదాయ శాఖ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లుగా భానూరి లక్ష్మయ్య, మన్నె నర్సింహులు, జంగిలి మల్లమ్మ, తిమ్మారెడ్డిగారి అంజిరెడ్డి, రోళ్లపాటి సత్యనారాయణలతో పాటుగా ఆలయ ట్రస్ట్ బోర్డు ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఆలయ ప్రధాన అర్చకుడు మహరాజుల రామకృష్ణ శర్మలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ పదవులకు వీరందరిచే ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అనంతరం ఆ ఐదుగురి సభ్యుల్లో నుంచి ఒకరిని బోర్డు చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు ఈ నెల 23వ తేదీ (శనివారం) పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రస్ట్ బోర్డు నూతన సభ్యులు బుధవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను సంగారెడ్డిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. బోర్డు డైరెక్టర్లుగా నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చిన్నరోళ్లపాటి రాజశేఖర్, సీనియర్ నాయకుడు తిమ్మారెడ్డిగారి మల్లారెడ్డి తదితరులున్నారు.

విద్యార్థుల ఇంటికి అధ్యాపకులు

● హాజరుశాతం పెంచేందుకు వినూత్న కార్యక్రమం



విద్యార్థులను కళాశాలకు పంపించాలని తల్లిని కోరుతున్న అధ్యాపకులు

వెల్దుర్తి, నవంబరు20(ఆంధ్రజ్యోతి) : కళాశాలకు రాని విద్యార్థుల ఇంటికి శ్రీరాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు వెళ్లి కళాశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. బుధవారం మండల పరిధిలోని ఉప్పులింగపూర్, రామాయిపల్లి, బండపోసన్‌పల్లి, ఎదులపల్లి గ్రామాలలో అధ్యాపకులు విద్యార్థుల ఇంటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 92 మంది విద్యార్థులు ఉండగా 55 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 106 మంది విద్యార్థులు ఉండగా 60 మంది విద్యార్థులు మాత్రమే కళాశాలకు హాజరవుతున్నారని వారు తెలిపారు. ఈ నెల 25వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలకు సంబంధించిన ఫీజును ప్రతి విద్యార్థి చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, నర్సింహులు, మధన్‌మోహన్, శ్యామ్, మహేష్, స్వామి, నాందేవ్ తదితరులు ఉన్నారు.

నల్లవాగుపైనే ఆశలు

- యాసంగిలో 4 వేల ఎకరాలకు నీరందించడమే లక్ష్యం
- ప్రాజెక్టులో నీరు పుష్కలం.. త్వరలో ఆయకట్టు నిర్ధారణ



పూర్తి స్థాయి నీటి మట్టంతో నిండుకుండలా నల్లవాగు ప్రాజెక్టు

కల్హేర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్‌జిల్లాలో ఎంతో ప్రాముఖ్యం కలిగి ఏకైక మధ్యతరహా ప్రాజెక్టుగా వెలుగొందుచున్న సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టు సాగు నీటిపైనే ఆయకట్టు రైతులు కోటి ఆశలు పెట్టుకున్నారు. వానకాలంలో ఆలస్యంగా ఈ ప్రాజెక్టులోకి వరద చేరుకున్నది. దీంతో ఆయకట్టు పరిధిలోని కుడి, ఎడమ, అత్యవసర కాలువల కింద రైతులు తమ భూముల్లో వరి నాట్లు వేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. ఆలస్యంగానైనా ప్రాజెక్టు నిండిపోవడం, నేటి వరకు రికార్డు స్థాయిలో ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1493 అడుగుల కాగా నీటి నిల్వ కూడా అంతే ఉండటంతో ఆయకట్టు రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వానకాలంలో కోల్పోయిన పంటను యాసంగిలో ఆరుతడి పంటలు వేసుకుని ప్రయోజనం పొందవచ్చునని భావిస్తున్నారు. దీనికి తోడు ఆయకట్టు పరిధిలో 4 వేల ఎకరాలకు సాగు నీరు అందజేసేలా కలెక్టర్ ఆధ్వర్యంలో టైబంధీ రూపొందిస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి కూడా రైతులకు ఇటీవల ప్రాజెక్టు వద్ద హామీ ఇవ్వడంతో యాసంగిపై గంపెడాశతో ఉన్నారు. నల్లవాగు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1493(మిలియన్ క్యూబిక్ ఫీట్స్) అడుగుల కాగా ప్రస్తుతం 1493 అడుగుల నీటి సామర్థ్యం కలిగి 0.6 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పరిధిలో కుడి, ఎడమ కాలువల కింద 5100 ఎకరాల ఆయకట్టు కలిగి ఉంది. కుడి కాలువ కింద సిర్గాపూర్ మండలంలోని సుల్తానాబాద్, గోసాయిపల్లి, పోచాపూర్, కల్హేర్ మండలంలోని బీబీపేట, ఫత్తేపూర్, మార్డి, ఖానాపూర్(కె), కిష్టాపూర్, ఇందిరానగర్, కల్హేర్ గ్రామాలకు చెందిన ఆయకట్టు భూములు ఉన్నాయి. ఎడమ కాలువ కింద సిర్గాపూర్ మండలంలోని సుల్తానాబాద్, బొక్కస్‌గామ్, అంతర్గాం, కామారెడ్డి జిల్లా పిట్లం మండల పరిధిలోని మార్దండ, తిమ్మానగర్ గ్రామాలకు చెందిన రైతుల భూములు ఉన్నాయి. అత్యవసర కాలువ కింద 60 ఎకరాలు సుల్తానాబాద్(నల్లవాగు) గ్రామానికి చెందిన రైతుల భూములు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఈ అత్యవసర కాలువ కింద 60 ఎకరాల భూములకు వరి పంటకే నీరు అందజేయాల్సి ఉంటుంది. మిగతా నిర్దేశిత ఆయకట్టుకు ఆరుతడి పంటల కోసం సాగునీరును అందజేస్తారు. మూడునాలుగు రోజుల్లో కలెక్టర్ అధ్యక్షతన ఎమ్మెల్యే, నీటిపారుదల శాఖ అధికారుల సమక్షంలో ప్రాజెక్టు టైబంధీ(ఆయకట్టు నిర్ధారణ) చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

త్వరలోనే టైబంధీతో ఆయకట్టు నిర్ధారణ



జిల్లా కలెక్టర్ అధ్యక్షతన తానూ, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ బోర్డు సమావేశమై త్వరలోనే నల్లవాగు ప్రాజెక్టు యాసంగి ఆయకట్టు నిర్ధారణ చేస్తాం. వానకాలంలో ప్రాజెక్టు ఆలస్యంగా నిండటం మూలంగా రైతులు నష్టపోయారని, యాసంగిలో అధిక శాతం రైతులకు ప్రయోజనం కలిగేలా సాగు నీరు అందించాలనే యోచనలో ఉన్నాం. నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి యాసంగిలో అధికశాతం ఆయకట్టుకు నీరందించేందుకు కృషి చేస్తా

-సంజీవరెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం..



నల్లవాగు ప్రాజెక్టు కింది ఆయకట్టు భూములకు యాసంగిలో ఆరుతడి పంటలకు సాగు నీరు అందించేందుకు చర్యలు చేపట్టాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇదివరకే ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచనతో కలెక్టర్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు టైబంధీకి సంబంధించిన వివరాలు అందజేశాం. ప్రస్తుత నీటి నిల్వ ఆధారంగా 4 వేల ఎకరాలకు సాగునీరు అందించే యోచనలో నీటిపారుదల శాఖ ఉంది. త్వరలో నిర్వహించే ఐడీబీ సమావేశంలో ఆయకట్టు నిర్ధారణ కానుంది.

-పవన్‌కుమార్ డీఈ, నీటిపారుదల శాఖ



పోటీలకు హాజరైన గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు

నాసా ప్రాంతీయ కన్వెన్షన్‌లో గీతం విద్యార్థిని ప్రతిభ

- 'రైటింగ్ ఆర్కిటెక్చర్' పోటీలో ప్రత్యేక అవార్డు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 20 : నాసా 67వ ప్రాంతీయ కన్వెన్షన్‌లో గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ రెండో ఏడాది విద్యార్థిని రేష్మిక రైటింగ్ ఆర్కిటెక్చర్ పోటీలో సత్తా చాటినట్లు ఇన్‌చార్జి డైరెక్టర్ బందన్ కుమార్ మిశ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె ప్రత్యేక ప్రస్తావన అవార్డును అందుకుని, ఓ ప్రతిష్ఠాత్మక వేదికలో తన సత్తా చాటినట్టు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని అరోరాస్ డిజైన్ అకాడమీలో ఇటీవల జరిగిన 67వ నాసా ప్రాంతీయ కన్వెన్షన్‌లో దాదాపు 25 మంది మొదటి, రెండో ఏడాది గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. వర్క్ షాపులు, పోటీలకు అతీతంగా, ఈ కార్యక్రమం వివిధ సంస్థల సహచరుల మధ్య అర్థవంతమైన పరస్పర చర్యలను పెంపొందించిందని, తరువాతి తరం వాస్తుశిల్పులలో స్నేహభావాన్ని, సహకార అభ్యాసాన్ని ప్రోత్సహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతం విద్యార్థులను అధ్యాపకురాలు శ్రుతి గావాలి సమన్వయం చేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

- డీఎస్పీ రవీందర్‌రెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ

పటాన్‌చెరు రూరల్, నవంబరు 20 : విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని క్రమశిక్షణతో వాటి సాధించి సమాజానికి మంచి పేరు తేవాలని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి సూచించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ముత్తంగి మహాత్మా జ్యోతిభాపూలే బీసీ గురుకుల కళాశాలలో జిల్లాస్థాయి అండర్ 19 అండర్ 14 క్రీడా పోటీల ముగింపు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో అమూల్యమైందని ఈ దశలో సోషల్ మీడియా, ఫోన్ వంటి వ్యసనాలకు ప్రభావితం కాకుండా ఉన్నత శిఖరాలని అధిరోహించాలని కోరారు. ఈ పోటీలలో అండర్ 19, అండర్ 14 క్రీడలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జగదేవ్ పూర్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. వ్యక్తిగత పోటీలలో పూజ (జగదేవపూర్) ఛాంపియన్‌గా నిలిచింది. అండర్ 14 వ్యక్తిగత పోటీలలో వి. వైశాలి నరసాపూర్ ఛాంపియన్‌గా నిలిచింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.నవనీత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చెట్టుకు ఆటో ఢీకొని వ్యక్తి మృతి



చంద్రకాంత్ మృతదేహం

రాయపోల్/గజ్వేల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన రాయపోల్ మండలం గుర్రాలసోఫా వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్‌కు చెందిన బిల్లివాల చంద్రకాంత్(36) ఈ నెల 19న రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలోని తన చెల్లి ఇంటికి వెళ్లి సాయంత్రం తన ఆటోలో తిరిగి నిజామాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్రాలసోఫా వద్ద ప్రమాదశాత్తు ఆటో చెట్టుకు ఢీకొంది. దీన్ని గమనించి స్థానికులు వారి బంధువులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వారు అతడిని గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ చెరువులో పడి డ్రైవర్..



చెరువులో పడిన ట్రాక్టర్, రమేష్ మృతదేహం (ఇన్‌సెట్లో)

నర్సాపూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ అదుపు తప్పి చెరువులో పడడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్ మండలం రుస్తుంపేట పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌లో తాత్కాలిక డ్రైవర్ రమేష్(26) చెత్తను తీసుకుని డంప్‌యార్డు వద్ద వేశాడు. అనంతరం తిరిగి చెరువు కట్టపై నుంచి వస్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి చెరువులో పడిడడంతో రమేశ్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ వివాహానికి నిరాకరించిన తండ్రి యువకుడి ఆత్మహత్య

కుకునూరుపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తండ్రి ప్రేమ వివాహాన్ని నిరాకరించడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కుకునూరుపల్లి శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమబెంగాల్‌కి చెందిన మహానంద సర్దార్(24) కుకునూరుపల్లి శివారులో ఓ ప్రైవేటు రెడిమిక్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం సర్దార్ తన స్వగ్రామమైన ముండాయనగర్‌కి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. దీనికి తండ్రి నిరాకరించడంతో మనస్తాపం చెందిన సర్దార్ మంగళవారం అర్ధరాత్రి తను పనిచేస్తున్న రెడిమిక్స్ కంపెనీ వెనకాల గల విద్యుత్ స్తంభానికి బెల్టుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

రామచంద్రాపురం, నవంబరు 20 : బాలిక అదృశ్యమైన ఘటన కొల్లూరు పోలీసు స్టేషన్ పరిధిలోని జ్యోతిరావు పూలే కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నేపాల్ దేశానికి చెందిన ఓ కుటుంబం పొట్టకూటి కోసం మనదేశ రాజధాని ఢిల్లీకి వచ్చారు. అక్కడ ఓ యువకుడితో జరిగిన ఘర్షణల కారణంగా ఢిల్లీ విడిచిపెట్టి బతుకుదెరువు కోసం తెలంగాణాలోని సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ జ్యోతిరావు పూలే కాలనీకి వచ్చారు. తమ ఒక్కగానొక్క కూతురు(17)తో భార్యభర్తలు కూలీ చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నారు. ఈ క్రమంలో రోజుమాదిరిగానే భార్యాభర్తలిద్దరు బుధవారం ఉదయం కూలీకి వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి కూతురు కనిపించలేదు. ఇరుగుపొరుగు వారిని విచారించినా కూతురు ఆచూకీ తెలియలేదు. ఆందోళన చెందిన దంపతులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రవీందర్ తెలిపారు.

ప్రిన్సిపాళ్ల సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శిగా రజిత



రజితను సన్మానిస్తున్న జోగిపేట కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

జోగిపేట, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్ల సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శిగా కొమ్ము రజిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జోగిపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న కొమ్ము రజిత మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల్లో విజయం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం.. కళాశాల లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, విఠల్, గోవర్ధన్‌రెడ్డి, నూనె శ్రీనివాస్, శ్రావణ్, జక్కుల మల్లేశం, జీల మల్లేశం, రాజ్ కుమార్, అనిత. శశికళ, ప్రసన్న, రషీద్ గౌస్, నర్సింహులు, బాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు రాని బస్టాండ్

వెల్దుర్తి, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వెల్దుర్తిలో ప్రయాణికుల సౌకర్యార్థం సుమారు 17 ఏళ్ల క్రితం బస్టాండ్ నిర్మించారు. భవనం కట్టి వదిలేసిన అధికారులు మరుగుదొడ్లు, మూత్రశాలలు , నీటిసౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క రోజు కూడా బస్సులు రాలేదంటే అతిశయోక్తి కాదు. కంట్రోలర్ కోసం ఏర్పాటు చేసిన రెండు గదులకు తాళం తీసిన నాథుడే లేకుండా పోయారు. దీంతో బస్టాండ్ బిక్షాటన చేసే వారికి, మందుబాబులకు అడ్డాగా మారింది. ఇంకా కొందరు ధాన్యం ఆరబోసుకుంటున్నారు.



ఎవరికోసం కట్టారో..!

- రూ. లక్షల ఖర్చు వృథా
- వినియోగంలోకి రాని భవనాలు
- హత్నూరలో ఐబీ అతిథిగృహం
- నర్సాపూర్‌లో సాముహిక మరుగుదొడ్లు
- వెల్దుర్తిలో బస్టాండ్ కట్టి 17 ఏళ్లు

అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపు లేని కారణంగా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని చోట్ల పనులు పూర్తి అయినా.. మరి కొన్ని చోట్ల కొద్ది పాటి నిధులు వెచ్చిస్తే వినియోగించే అవకాశం ఉన్నా.. వాటిని గాలికి వదిలేశారు. దీంతో ప్రజాధనం నీటిలో పోసినట్లు అవుతున్నది. రూ. లక్షలు వెచ్చించి కట్టిన ఈ భవనాలను ఎందుకు కట్టారో.. ఎవరి కోసం కట్టారో అన్న చర్చ స్థానికంగా జరుగుతోంది. కేవలం కాంట్రాక్టర్లు, వారు ఇచ్చే కమీషన్ల కోసం కట్టి.. అలా వదిలేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హత్నూరలో నిరుపయోగంగా ఉన్న ఐబీ అతిథి గృహం



హత్నూరలో 'అతిథి' గృహమే..

హత్నూర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో హత్నూర మండల కేంద్రంలో అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రూ.27 లక్షల వ్యయంతో ఐబీ అతిథి గృహం మంజూరు చేయించగా, భవన నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. 2014 ఫిబ్రవరి 13న ఎమ్మెల్యే ఐబీ అతిథిగృహాన్ని ప్రారంభించారు. అయితే, అందులో ఫర్నిచర్, నీటి సదుపాయం కల్పించకపోవడంతో ఆ భవనం వినియోగించుకోలేని పరిస్థితి. దీంతో ప్రారంభించిన వారం రోజులకే తాళం పడింది. వినియోగంలో లేకపోవడంతో ఇప్పుడా భవనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. తలుపులు కిటికీలు తుప్పపట్టి పోతున్నాయి.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



అవసరమైన ఫర్నిచర్ లేకపోవడం వల్లే ఐబీ అతిథి గృహాన్ని ఎవరూ వినియోగించడంలేదు. ఫర్నిచర్‌కు అవసరమైన అదనపు నిధుల మంజూరు కోసం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతు పనులతోపాటు ఫర్నిచర్‌ను ఏర్పాటు చేసి అతిథిగృహాన్ని వినియోగంలోకి తీసుకువస్తాం.

- భూపుత్ర, ఐబీ ఏఈ



నర్సాపూర్‌లో మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న సామూహిక మరుగుదొడ్డి

కట్టి మూడేళ్లు.. ప్రారంభించడానికి ఎన్నేళ్లో..

నర్సాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణాన్ని బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత ప్రాంతంగా కేంద్రం ప్రకటించింది. పట్టణంలో ఎక్కడా బహిరంగ మల, మూత్ర విసర్జన లేకుండా చర్యలు తీసుకున్నామని, బహిరంగ మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించామని అధికారులు రికార్డుల్లో, ప్రభుత్వానికి ఇచ్చే నివేదికల్లో ఘంటాపథంగా చెప్పుకున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది అనడానికి పట్టణంలోని మూడు కూడళ్లలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లే నిదర్శనం. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా రూ. 45 లక్షలు వెచ్చించి.. వీటిని నిర్మించి మూడేళ్లు దాటుతున్నా.. వినియోగంలోకి తీసుకురాలేదు. పట్టణంలోని ఆసుపత్రి వద్ద, బస్టాండులో, తూప్రాన్ మార్గంలో ఒక్కొక్కటి రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ సామూహిక మరుగుదొడ్లు అలంకార ప్రాయంగా మారాయి. అయితే, జనం నుంచి విమర్శలు రావడంతో ఆస్పత్రి వద్ద ఉన్న సామూహిక మరుగుదొడ్డిని ప్రారంభించినా.. నిర్వహణ పట్టించుకోకపోవడంతో అది ఎప్పుడు తెరిచి ఉంటుందో.. ఎప్పుడు మూసి ఉంటుందో తెలియని పరిస్థితి. ఇక మిగిలిన చోట్ల కట్టి వదిలేయడంతో జనం వాటిని చూసి ఇవి ఎందుకు కట్టారో కట్టిన వారికే తెలియాలి అని అంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంగారెడ్డి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్ పేట గ్రామ పరిధిలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో సంగారెడ్డి మండల ఏఈ ప్రశాంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33కేవీ, హెచ్‌పీసీ-2 ఫీడర్‌లో మరమ్మతుల క్రమంలో ఇస్మాయిల్‌ఖాన్‌పేట, గౌడిచర్ల, దాసుగడ్డ తండా 3 గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

● కంది, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కంది పరిధిలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కోసం మండలంలోని ఆరుట్ల, బేగంపేట,చిద్రుప్ప,ఎర్దనూరు, బ్యాతోల్, మామిడిపల్లి, కవలంపేట, తునికిళ్లతండా, వడ్డెనగూడ తండా, ఉత్తర్‌పల్లి, మాక్సా అల్లురూ, కంది గ్రామాల్లో గురువారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్‌సరఫరా ఉండదని ఏఈ ప్రకాశ్ తెలిపారు.

● జిన్నారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కోసం ఈ నెల 21న ఉమ్మడి జిన్నారం మండలంలో సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ దుర్గాప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. గడ్డపోతారం, కాజీపల్లి, కిష్టాయ్యపల్లి, వావిలాల గ్రామాల పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు వారు తెలిపారు.

అందుబాటులోకి రానున్న ఆర్‌వోబీ

జహీరాబాద్ పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి



- బిల్లుల రావడంతో పనుల్లో వేగం
- ఇప్పటికే 70 శాతం పనులు పూర్తి
- మరో నెలరోజుల్లో అందుబాటులోకి వచ్చేలా చర్యలు
- రేపటి నుంచి పనులు పూర్తయ్యే వరకు బ్రిడ్జికి ఇరువైపులా రాకపోకలు బంద్

జహీరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి త్వరలో వినియోగంలోకి రానున్నది. కాంట్రాక్టర్‌కు పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో కొంతకాలంగా పనులను నిలిపివేశారు. ఇటీవల బ్రిడ్జికి సంబంధించిన బిల్లులు రావడంతో పనులను వేగవంతం చేసే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. బ్రిడ్జిపనులు ప్రస్తుతం 70 శాతం పూర్తయ్యాయి. ఐదారేళ్లుగా బ్రిడ్జిపనులు కొనసాగుతున్నప్పటికీ బిల్లులు రాని కారణంగా పనులను నత్తనడకన కొనసాగాయి. జనవరిలో బ్రిడ్జిని పూర్తిచేసే దిశగా అధికారుల చర్యలు తీసుకుంటున్నారు.

నెలరోజుల పాటు రాకపోకలు నిలిపివేత

రైల్వే ఓవర్ బ్రిడ్జిపనులను చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 22 నుంచి డిసెంబరు 22వరకు బ్రిడ్జికి ఇరుపక్కల నుంచి వెళ్లడానికి వీలుండదని, రాక పోకలను నిలిపివేస్తున్నామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. బ్రిడ్జికి ఇరువైపు సీసీరోడ్లను వేయడం, అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిపనులను పూర్తిచేసే దిశగా చర్యలు చేపడుతున్నామని వారు తెలిపారు. బ్రిడ్జిపనులను వేగవంతం చేసేందుకు వీలుగా రాకపోకలను నిలిపివేస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు ఇందుకు సహకరించాలని కోరారు. బ్రిడ్జికి ఇరువైపుల రోడ్లను మూసివేస్తున్న సందర్భంగా వాహనదారులు, ప్రయాణికులు మొగుడంపల్లి రోడ్డు, అల్గోల్ చౌరస్తా నుంచి అల్లానా మీదుగా బీదర్ వెళ్లే రోడ్డును, 65వనెంబర్ జాతీయరహదారిని వినియోగించుకోవాలని వారు కోరారు.



ఆర్‌వోబీ వద్ద చేపడుతున్న కాంక్రీట్ పనులు

అర్బన్ పార్కు వద్ద ఎండు గంజాయి స్వాధీనం

నర్సాపూర్,నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని అర్బన్ పార్కు వద్ద వాహనాల తనిఖీ సందర్భంగా ఓ స్కూటీలో తరలిస్తున్న 104 గ్రాముల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పద్మ బుధవారం తెలిపారు. ఎక్సైజ్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం జాతీయ రహదారిపై అర్బన్ పార్కు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నర్సాపూర్‌కు చెందిన మహ్మద్‌సాజిద్ అనే వ్యక్తి స్కూటీలో 104గ్రాముల ఎండుగంజాయి పట్టుబడిందన్నారు. వాహనంతో పాటు అతడిని వెంటనే అదుపులో తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో రోడ్డు పనులపై ఎంపీకి ఫిర్యాదు



మెదక్ ఎంపీకి ఫిర్యాదు చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

జిన్నారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిన్నారం శివారు 1002 సర్వే నెంబరు ప్రభుత్వ భూమి నుంచి ప్రైవేటు వెంచర్ కోసం సీసీ రోడ్డు ఏర్పాటుకు పనులు చేపట్టినా, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కలిసి ఫిర్యాదు చేశారు. బుధవారం ఎంపీ రఘునందన్‌రావును జిన్నారం ప్రాంతానికి చెందిన వివిధ పార్టీల నాయకులు కలిశారు. ఇటీవల సదరు ప్రభుత్వ భూమి నుంచి వంద అడుగుల వెడల్పుతో సమీపంలోని ప్రైవేటు వ్యక్తుల భూములు వెంచర్ల కోసం రోడ్డు పనులు చేపట్టారని తెలిపారు. వెంటనే స్పందించిన ఎంపీ తహసీల్దార్, ఎస్‌ఐలకు ఫోన్ చేసి సమస్యను చెప్పారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఫిర్యాదు చేసినవారిలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, మహేందర్‌గౌడ్, రమేష్, రాజేందర్‌రెడ్డి, వెంకటేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మందు బాబులకు అడ్డాగా సంగారెడ్డి కలెక్టరేట్!





కలెక్టరేట్ ఆవరణలో పడేసిన బీరు సీసాలు, బిర్యానీ ప్యాకెట్లు

సంగారెడ్డి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ కార్యాలయాన్ని కొందరు మందుబాబులు అడ్డాగా మార్చుకున్న ఘటన వెలుగు చూసింది. ఎప్పుడూ బిజీగా ఉండే కలెక్టరేట్ ప్రాంగణంలో బీరు సీసాలు, బిర్యానీ ప్యాకెట్లు లభ్యమవడం తీవ్ర కలకలం రేపింది. సంగారెడ్డి సమీకృత కలెక్టరేట్ ఆవరణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు, సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. అయినా మద్యం సీసాలు, బిర్యానీ ప్యాకెట్లు లభించడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై విచారణ చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉన్నతాధికారులను ఆదేశించినట్టు తెలిసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, అధికారులను కలెక్టర్ ఆదేశించినట్టు సమాచారం.

ఖేడ్ నియోజకవర్గంలో రికార్డుస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

నారాయణఖేడ్/కల్హేర్/పెద్దశంకరంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ నియోజకవర్గంలో, ఇప్పటి వరకు ఐకేపీ ఆధ్వర్యంలో రికార్డు స్థాయిలో 2 లక్షల పై చిలుకు క్వింటాళ్ల వరిధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని ఎమ్మెల్యే సంజీవ రెడ్డి పేర్కొన్నారు. బుధవారంఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం ఐకేపీ ద్వారా గతంలో కన్నా 40 శాతం అధికంగా కొనుగోలు చేయగా, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ధాన్యం అదనమని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో క్వింటాల్‌కు 9 కిలోల తరుగు తీయగా ప్రస్తుతం 2 కిలోలు మాత్రమే తరుగు తీస్తున్నట్టు చెప్పారు. ఎనిమిది టీఎంసీల నీటిని సింగూరుకు మళ్లించి బసవేశ్వర ఎత్తిపోతల ద్వారా సాగునీటిగా అందించాలని తాను



ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, సవితహన్మండ్లు, న్యాయవాదులు బోజిరెడ్డి, సంగన్న, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముంతాజ్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా కల్హేర్ సిర్గాపూర్‌లోని రైతు వేదికల్లో బుధవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి రెండు మండలాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా కడ్పల్ గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల పశువులు మరణించగా వారికి రూ.40వేల చొప్పున పరిహారం చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాశంకర్, ఎంపీడీవో మల్సూర్‌నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. పెద్దశంకరంపేట మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఆవరణలో మండల పరిధిలోని అర్హులైన 27 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేస్ బాయ్, ఎంపీడీవో రఫీక్‌ఉన్నిసా, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం ఇంటి ముట్టడికి

తరలుతున్న గిరిజన నాయకుల అరెస్టు

మాసాయిపేట/హవేళిఘణపూర్/చిన్నశంకరంపేట/నారాయణఖేడ్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): లగుచెర్ల ఘటనలో గిరిజన నాయకులపై జరిగిన దాడికి నిరసనగా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాల నుంచి గిరిజన సంఘాల పిలుపు మేరకు తలపెట్టిన సీఎం ఇంటి ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న గిరిజన నాయకులను బుధవారం పోలీసులు ఎక్కడికక్కడ హౌజ్ అరెస్టులు చేశారు. మాసాయిపేట మండలంలోని చెట్లతిమ్మాయిపల్లి, వెనుక తండా, నడిమి తండా, సాజు గిరిజన తండాలకు చెందిన గిరిజన నాయకులను చేగుంట పోలీసులు హౌస్ అరెస్టు చేసి చేగుంట పోలీసుస్టేషన్‌కు తరలించారు. హవేళిఘణపూర్ మండలం నుంచి సీఎం ఇంటి ముట్టడికి వెళ్తున్న లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు రంజిత్ నాయక్, ఫుల్‌సింగ్, తరుణ్ నాయక్‌లను ఎస్‌ఐ సత్యనారాయణ బుధవారం అరెస్టు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల జోలికి వస్తే చూస్తూ ఊరుకోబోమని బీఆర్‌ఎస్ చిన్నశంకరంపేట మండల అధ్యక్షుడు రాజు హెచ్చరించారు. గిరిజనులను ఇబ్బందులకు గురిచేసి అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ గిరిజన మాజీ సర్పంచులకు బీఆర్‌ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. అరెస్టు చేసిన గిరిజనులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో పలువురు గిరిజన సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు రవీందర్‌నాయక్, పలు గిరిజన సంఘాల నాయకులు ఉన్నారు. సాయంత్రం వారిని సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక

మెదక్ అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 10వ తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల కోసం ఈ నెల 22న శుక్రవారం మెదక్ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ బుధవారం తెలిపారు. అండర్-8, 10, 12 బాలబాలికలకు రన్స్, త్రో జేమ్స్ విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన క్రీడాకారులు వచ్చే నెల మంచిర్యాల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. మిగితా వివరాలకు 9963005540 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

రైస్‌మిల్‌ను తనిఖీ చేసిన ఆర్డీవో

హవేళిఘణపూర్, నవంబరు20; (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాయత్రి పారాబాయిల్డ్ రైస్‌మిల్‌ను మెదక్ ఆర్డీవో రమాదేవి బుధవారం తనిఖీ చేశారు. రైస్ మిల్లుకు వచ్చిన ధాన్యం వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

‘ఓటర్లుగా నమోదు చేయించుకోవాలి’

నారాయణఖేడ్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అర్హులందరూ ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని స్థానిక ఆర్డీవో అశోక చక్రవర్తి అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23, 24 లలో పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్వోల ద్వారా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, వివిధ రాజకీయపార్టీల ప్రతినిదులు పాల్గొన్నారు.

‘నాణ్యతాప్రమాణాలు పాటించాలి’

నిజాంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరి నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి ఎం గోవింద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నందిగామ గ్రామంలో బుధవారం ధాన్యం కేంద్రాన్ని సందర్శించారు.

సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



రాయికోడ్: కోడూరులో సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న సంగారెడ్డి అదనపు కలెక్టర్

రాయికోడ్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సంబంధిత ఎన్యూమరేటర్లు పకడ్బందీగా నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కోడూరులో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పర్యవేక్షించారు. మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామ శివారులో బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. భవనంలోని కంప్యూటర్ గ్రంథాలయాల పరిసరాలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి జగదీశ్వర్, ఎంపీడీవో ఎంఏ షరీఫ్ పాల్గొన్నారు.

● పెద్దశంకరంపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను సక్రమంగా నమోదు చేయాలని మెదక్ జిల్లా జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే వివరాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పేట ఎంపీడీవో రఫీక్‌ఉన్నిసా, పంచాయతీ కార్యదర్శి వెంకటరాములు ఉన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్ అందుకున్న విద్యార్థులతో ప్రముఖులు, ఫ్యాకల్టీ

నర్సాపూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని విష్ణు ఫార్మసీ కాలేజీలో బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ కార్యక్రమం, ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ అందచేసే గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర రావు, యూఎస్‌ఏ యూనివర్సిటీ ప్రొఫెసర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. ఫార్మసీ పూర్తయిన విద్యార్థులకు విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ ఆదిత్యతో కలిసి సర్టిఫికెట్లు అందచేశారు.

ఇగమొస్తున్నది..

(5వ పేజీ తరువాయి)

సింగిల్ డిజిట్‌కు పడిపోయింది. పడిపోయాయి. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలంతో పాటు న్యాల్‌కల్ మండలంలోనూ రాత్రి ఉష్ణోగ్రత సింగిల్ డిజిట్‌కు పడిపోయింది. కిందటి రోజు 11.1 డిగ్రీలు ఉండగా మంగళవారం రాత్రి మాత్రం 9.9 డిగ్రీలకు పడిపోయింది. ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు 11 డిగ్రీలు వరకు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లా మర్కుక్‌లో 11.1 డిగ్రీలు, మెదక్ జిల్లా శివ్వంపేటలో 11.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో సాయంత్రం నుంచే శీతలగాలులు తాకుతున్నాయి. వేకువజామున పొగమంచు కమ్మేస్తున్నది. తెల్లవారుజామున చలి తీవ్రంగా ఉండడంతో వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



చలికాలంలో అలర్జీ, ఆస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, బీపీ, గుండె సంబంధిత వ్యాధులు కలిగిన రోగులు జాగ్రత్తలు తీసుకోవాలి. నిత్యం వ్యాయామం చేయాలి. చిన్నారులకు చలిగాలి తగలకుండా చూడాలి. ఎండ వచ్చిన తర్వాతే బయటకు రావాలి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలి. చలి తీవ్రత తగ్గే వరకు ఉన్ని దుస్తులను ధరించాలి.

- డాక్టర్ పెంటాగౌడ్, మెదక్

విద్యా వికాసానికి గ్రంథాలయాలే మార్గదర్శకాలు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డీఈవో రాధాకిషన్

మెదక్ అర్బన్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): విద్యా వికాసానికి గ్రంథాలయాలు మార్గదర్శకాలుగా నిలుస్తాయని డీఈవో రాధాకిషన్ పేర్కొన్నారు. మెదక్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన వారోత్సవాల ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఈవో రాధాకిషన్, గ్రంథాలయ చైర్మన్ సుహాసినీరెడ్డి, ఆర్డీవో రమాదేవి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో నీలకంఠం, కార్యదర్శి వంశీకృష్ణ, న్యాయనిర్ణేతలు సంతోష్‌గౌడ్, రాజేందర్, రచయిత్రి కవిత, ప్రముఖ వ్యాఖ్యాత వైద్య శ్రీనివాస్‌శర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘పుస్తకపఠనంపై ఆసక్తిని పెంచుకోవాలి’

జహీరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తకాల పఠనంపై అవగాహనను పెంచుకోవాలని జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం, మండల విద్యాధికారి బస్వరాజ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అర్జున్‌నాయక్ తండాలో రూం టూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం గోపాల్, హెచ్‌ఎం నాగరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

గుమ్మడిదలలో ముగిసిన సహకార వారోత్సవాలు



ముగింపు వారోత్సవాల్లో పాల్గొన్న రైతులు అధికారులు

గుమ్మడిదల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో సహకార సంఘం వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. మండలంలోని రైతు వేదికలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని సహకార సంఘాల ప్రాధాన్యాన్ని చాటి చెప్పారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాలు కేవలం రుణాల కోసం మాత్రమే కాకుండా, గ్రామీణ ప్రజల జీవితాల్లో స్థిరత్వాన్ని తీసుకురావడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, మాజీ సర్పంచు చిమ్ముల నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ మద్దుల బాల్‌రెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ ఎండీ అన్నపూర్ణ, జాయింట్ రిజిస్ట్రార్. తుమ్మ ప్రసాద్, జాయింట్ రిజిస్ట్రార్ హైదరాబాద్ ధాత్రిదేవి తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారుల ప్రతిభ



చిన్నారుల భరతనాట్యం

కంది, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎద్దుమైలారం వద్దనున్న ఆయుధకర్మాగారంలోని ఉద్యోగుల పిల్లలు సాంస్కృతిక నృత్యాల్లో అద్భుత ప్రతిభ కనబర్చారు. ఆయుధ కర్మాగారం ఎస్టేట్స్‌లో నివాసం ఉండే చిన్నారులు శిష్టా శేషసాయి శ్రీజ, లిఖిత, గాయత్రి, సృజన, మహిమ, హంసిని, శివేంద్ర, సిద్ధార్థ బుధవారం హైదరాబాద్‌లోని అంతర్జాతీయ తెలుగు సాంస్కృతికసంస్థ విస్సా నిలయంలో భరతనాట్యం, శ్లోకాలు, పాటల పోటీల్లో పాల్గొని అలరించారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రపంచస్థాయి సాహితీవేత్తలు, భారత సాంస్కృతిక రాయబారి జ్యోసుల ప్రభాశాస్త్రి, సాంకేతిక నిపుణులు ప్రియాంక నేహా, ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్ కాన్ఫెడరేషన్ సూత్రధారి సీజర్ స్టైరోత్రాలు చిన్నారుల ప్రతిభను ప్రశంసించారు.

‘యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి’

సంగారెడ్డి అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ సూచించారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగాలు, సామాజిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని మత్తు పదార్థాల వినియోగానికి సంబంధించి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి



కందిలో శ్రీ రుక్మిణీపాండురంగస్వామి కల్యాణం జరుపుతున్న వేద పండితులు



కొండాపూర్: గొల్లపల్లిలో పోచమ్మతల్లి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా బోనాల ఊరేగింపు



పెద్దశంకరంపేట: అయ్యప్ప మాల వేసుకుంటున్న స్వాములు

కంది, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన కందిలో బుధవారం శ్రీరుక్మిణీపాండురంగస్వామి కల్యాణోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కనులపండువలా ఆలయ ధర్మకర్తలు సునీల్ దేశ్‌ముఖ్, దీపక్ దేశ్‌ముఖ్‌ల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ ఉత్సవాలను ఏటా కార్తీక బహుళ సప్తమి పర్వదినాల్లో నిర్వహిస్తారు. వేలాది భక్తులు కల్యాణ మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో వీక్షించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ చేశారు.

● కొండాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొల్లపల్లిలో బుధవారం పోచమ్మతల్లి ఆలయ చతుర్థ వార్షికోత్సవంలో భాగంగా అలయ కమిటీ సభ్యులు, భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో శివసత్తుల శిగాలు, పోతురాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

● రేగోడు నవంబరు 20(ఆంధ్రజ్యోతి): భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కల్యాణోత్సవం రేగోడు గోకర్ణేశ్వర ఆలయంలో బుధవారం వైభవంగా జరిగింది. అర్చకుడు మహేష్‌స్వామి వేద మంత్రాల మధ్య కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

● వెల్దుర్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉప్పులింగాపూర్‌లో అభయ రామాలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సీతాసమేత అభయ రామచంద్ర స్వామి ఆలయం 4వ వార్షికోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

● కల్హేర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బల్కం చెల్కా తండాలోని ప్రఖ్యాత విశ్వపాలిని జ్వాలాముఖి భవానీ మాతా, సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయాల 12వ వార్షికోత్సవాలు ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్నట్టు ఆలయాల ధర్మకర్త, రవాణా శాఖ డిప్యూటి కమిషనర్ మూడ్ కిషన్‌నాయక్ తెలిపారు.

● పటాన్‌చెరు, నవంబరు, 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీరంగూడ గ్రీన్‌మీడోస్ కాలనీలో అమీన్‌పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నర్సింహగౌడ్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజను బుధవారం ఘనంగా నిర్వహించారు. పడిపూజలో వేలాదిగా దీక్షాస్వాములు పాల్గొన్నారు. పడిపూజా కార్యక్రమం కేరళ నంబూద్రీ పూజారుల ఆధ్వర్యంలో అంగరంగవైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన భక్తిగీతాల సంగీత విభావరి అలరించింది. మహాపడి పూజా కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

● సంగారెడ్డి అర్బన్/సంగారెడ్డి రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని నవరత్నాలయంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని సాహితీరాము గురుస్వామి బుధవారం ప్రారంభించారు. అయ్యప్ప స్వాముల సౌకర్యార్థం జనవరి 14 వ తేదీ వరకు మణికంఠ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిత్యం అన్నప్రసాద వితరణ ఉంటుందని, అయ్యప్ప స్వాములు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మణికంఠ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తెలిపారు.

● పెద్దశంకరంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలాధరణతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని పేట గురుస్వామి రామచంద్రచారి అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలోని వేణుగోపాలస్వామి ఆలయం ఆవరణలో పేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్‌తో పాటు పలువురు అయ్యప్ప మాల దీక్షధారణ చేశారు. అధిక సంఖ్యలో యువకులు మాల ధారణ చేయడం మంచి పరిణామమన్నారు.